క్లుప్తంగా

రేపు డెమొక్రటిక్ పీఆర్టీయూ సమావేశం

పెనుగంచిప్రోలు: ఈనెల 16న ఉదయం 10 గంటలకు డెమొక్రటిక్ పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం విజయవాడలోని డీపీఆర్టీయూ కార్యాలయంలో జరుగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగ జమలయ్య, మర్రి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని రాష్ట్ర, జిల్లా మండల కార్యవర్గసభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు



వత్సవాయి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌ను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో ఎల్.నాగరాజు తెలిపారు. ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు పంపిణీ చేసే నిమిత్తం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో నాగరాజు మాట్లాడుతూ ఈ స్టూడెంట్ కిట్‌లో మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, ఒక జత సాక్స్, బెల్ట్, బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను ప్రధానోపాధ్యాయులు వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు.

న్యాయవాదుల హర్షం



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు సీఎం చంద్రబాబు సంతకం చేయడంపై జగ్గయ్యపేట న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కటింగ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి దామాల సంతోష్, న్యాయవాదులు మెట్టిల ఆంజనేయులు, బి.వెంకట్రామయ్య, అన్నెపాగ కాంతారావు, వై.ధనుంజయ, రాయపూడి శ్రీనివాసరావు, మార్కపూడి నాగేశ్వరరావు, ఎం.కృష్ణయ్య, గోనెల వెంకటేశ్వర్లు, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో శుక్రవారం రైల్వే హాస్పటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉంటే ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలకు కాపాడవచ్చన్నారు. చాలమందిలో రక్తదానంపై ఎన్నో ఆపోహలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు.
ఒక వ్యక్తి రక్తదానం చేస్తే తిరిగి అతని శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. రక్తదానం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 86 మంది హాస్పటల్ సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం తునికి చెందిన దర్పణ నాట్య అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య అకాడమికి చెందిన సి.వరలక్ష్మీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

చిన్నారుల్లో బడి భయం

- బుజ్జగింపే ఏకైక మార్గం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జగ్గయ్యపేట: జూన్ నెల వచ్చిందంటే చాలు.. తల్లిదండ్రుల్లో హైరానా.. బడిగంటలు మోగగానే కొందరు చిన్నారులు కేరింతలు కొడితే.. మరికొందరు చిన్నారులు ఏడుపు మొహం పెడతారు.. బుడిబుడి అడుగులు వేసే చిన్నారులను బడిలో వేసేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతారు. చిన్న పలక, అందమైన దుస్తులు ధరించి, అడుగులో అడుగేస్తూ బుజ్జాయిలు బడికి వెళ్తుంటే వారిని చూసి తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. వారి ఆనందానికి అవధులే ఉండవు. అయితే కొందరు పిల్లల విషయంలో మాత్రం తిప్పలు తప్పవు. బడి పేరెత్తితే చాలు వారిలో వణుకు మొదలవుతుంది. కన్నీరు ఆగకుండా వచ్చేస్తుంటుంది. ఇక బడి గంట వినబడిందంటే చాలు గుండెల్లో రైళ్లు పరిగెత్తాల్సిందే. ఇలాంటి చిన్నారులను బడికి పంపడం తల్లిదండ్రులకు కత్తిమీద సామే.

తక్కువ వయసులోనే పాఠశాలలకు..

గతంలో పిల్లలకు అయిదారేళ్ల వయసు వచ్చే వరకు పాఠశాలలకు పంపేవారు కాదు. బాల్యం హాయిగా ఇంట్లోనే పెద్దల మధ్య గడిచిపోయేది. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి చాలా వరకు తగ్గిపోయింది. చిన్న కుటుంబాల సంస్కృతి పెరిగింది. ఈ పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలను వీలైనంత తక్కువ వయసులోనే పాఠశాలలకు పంపేందుకు ఆసక్తిచూపుతున్నారు. ఇంట్లో ఉంటే అల్లరి చేస్తారని, బడికి పంపితే మంచి అలవాట్లు అలవడుతాయని మూడేళ్ల పిల్లలను సైతం బడిలో చేర్పుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో మొదలు గ్రామాల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. మూడేళ్లు నిండితే చాలు పిల్లలు స్కూల్లో కనిపిస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ చిన్నారులకు పాఠాలు మొదలువుతున్నాయి. ఎంతో డబ్బు పోసి పిల్లలను



పాఠశాలలో విద్యార్థులు

పాఠశాలలకు పంపితే వారు వెళ్లకుండా మారాం చేయడం వెనుక ఉన్న కారణాలను కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి.

తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం..

చిన్నారుల్లో భయాన్ని పోగొట్టడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. కారణాలు ఏవైనా స్కూలుకు వెళ్లమని పేచీపెట్టే పిల్లలను సరైన రీతిలో బుజ్జగించాలి. వారిని కొట్టి, తిట్టి భయపెట్టడం మంచిది కాదు. బలవంతంగా బడికి పంపిస్తే, వారిలో పాఠశాలపై వ్యతిరేక భావన కలిగే అవకాశం ఉంది. పాఠశాలలో చేరిన కొత్తలో తల్లిదండ్రుల్లో ఒకరు స్కూలులో దింపి, పాఠశాల పూర్తి కాగానే తీసుకువస్తుంటే పిల్లల్లో మనోధైర్యం ఏర్పడుతుంది.

స్కూల్ ఫోబియానే కారణం..

సాధారణంగా పిల్లలు పాఠశాల అంటే భయపడటాన్ని సైన్స్ పరిభాషలో స్కూల్ ఫోబియా అంటారు. ఇది ఉన్న పిల్లలు బడి గేటు దగ్గరకు రాగానే బిగ్గరగా ఏడవడం, వాంతులు చేసుకోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, కడుపునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తుంటాయి. తల్లిదండ్రులు పిల్లాడు నటిస్తున్నాడు అనుకోకుండా జాగ్రత్తగా చూడాలి. వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లడం మంచిది. బడి అంటే భయపడే పిల్లలను బలవంతంగా పంపడం సరికాదు. వారి భయానికి కారణాన్ని కనుగోని దాన్ని తొలగించిన అనంతరమే పంపడం మంచిది. దాదాపు నూటికి 90శాతం మంది పిల్లలు స్కూలుకు ఎలాంటి పేచీ పెట్టకుండా వెళతారు. మిగిలిన పదిశాతం మందితోనే సమస్య. వీరు స్కూలు అంటేనే భయపడిపోతుంటారు. బడికి వెళ్లేందుకు ఇష్టపడక మారాం చేస్తుంటారు.

ఉపాధ్యాయుల ప్రభావం..

తల్లిదండ్రుల సంరక్షణ నుంచి స్కూలుకు వెళ్లగానే ఉపాధ్యాయుల వ్యవహార శైలి పిల్లల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అందుకే పిల్లల విషయంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకం. పిల్లల్లో ఉండే స్కూల్ ఫోబియాను పోగొట్టాలంటే ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరం. పిల్లలు ఉపాధ్యాయులను చూడగానే భయపడాలనే భావనతో ఉండకూడదు. చిన్నారులతో ఉపాధ్యాయులు సన్నిహితంగా, స్నేహపూర్వకంగా మెలగాలి. ఒక ఫ్రెండ్‌లా మాట్లాడి దగ్గరకు తీసుకోవాలి. పిల్లల మనసులో ఉపాధ్యాయులు కొడతారనే భావన తొలగించే ప్రయత్నం చేయాలి. ఉపాధ్యాయుల తీరు పిల్లలకు ఇబ్బంది కలగకుండా ఉండాలి. నర్సరీ పిల్లలకు వీలైనంత వరకు హోం వర్కు లేకుండా చూడాలి. వారిని అనవసర వత్తిడికి గురి చేయకూడదు.చిన్నప్పుడే గొప్ప వారి జీవిత చరిత్రలను చెబితే వారికి జీవితాంతం గుర్తుంటాయి. ఓ మంచి లక్ష్యం ఏర్పడటానికి దోహదం చేస్తాయి. స్కూలుకు రోజూ వస్తే కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు, చిన్నారులకు వివరించడం ద్వారా వారిలో ఈ ఫోబియోను పోగొట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

భయమే కారణం...



స్కూల్ ఫోబియాతో పిల్లలకు లేనిపోని సమస్యలు వస్తుంటాయి. పాఠశాల అంటే భయమే ఇందుకు కారణం. ఈ ఫోబియోతో కొందరు వాంతులు చేసుకుంటారు. మరి కొందరు కడుపులో నొప్పి అంటూ మారాం చేస్తారు. వారిని ఆ ఫోబియా నుంచి బయటకు తీసుకురావాలి. వారికి మంచి వాతావరణం కల్పిస్తే ఫోబియా నుంచి బయట పడతారు. ఒకసారి ఆ ఫోబియా నుంచి పిల్లలు బయటకు వస్తే మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నం కాదు.

– పి.నందకిషోర్, పిల్లల వైద్యుడు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు :ఎస్ఐ

కంచికచర్ల : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్నిరాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ప్లెక్సీలు చించడం, తగులబెట్టడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాయని అన్ని రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రతిఒక్కరూ వివాదాలకు తావులేకుండా కలిసి ఉండాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడి జీవితాలను కేసులపాలు చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేలా సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

వీరులపాడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని వీరులపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయించే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా దుకాణదారులు ఎప్పటికప్పుడు స్టాకు నిల్వలు తదితరాలకు సంబంధించిన రికార్డులు నమోదు చేయాలన్నారు. రైతులు కూడా రశీదు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నందిగామ: అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. పట్టణంలోని తన నివాసంలో నందిగామ నియోజకవర్గంలోని పలు ముఖ్యశాఖల అధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని సమస్యలు, వాటిని పరిష్కరించే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలన్నారు. కార్యాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా కలుషితంలేని తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆయాశాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం

జగ్గయ్యపేట: సరైన ఫిట్‌నెస్‌లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేస్తామని పేట ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ తెలిపారు. పట్టణంలో ఆర్టీఏ అధికారులు శుక్రవారం వాహనాల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కోదాడ రోడ్డులో పలు విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. బస్సు ప్రయాణ సమయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలు బస్సులను నడిపే విషయంలో నిబంధనలకు తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా బస్సుల్లోని కిటికీలకు మెస్, ప్రథమ చికిత్సా కిట్, మంటలు ఆర్పే సిలిండర్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సరైన శిక్షణ పొందిన డ్రైవర్లతోనే వాహనాలను నడిపించాలని ఆయన సూచించారు.



స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీఓ రవికుమార్

టీటీఈలపై దాడులకు నిరసన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):విధుల్లో ఉన్న టీటీఈలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంగ్ టిక్కెట్ చెక్కింగ్ బ్రాంచ్, మజ్దూర్ యూనియన్ నేతలు రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శించి సీనియర్ డీసీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగ్ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 10న ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు టీటీఈలపై కొంత మంది దాడి చేసి రూ. 70 వేల నగదు, వారి వంటిపైన ఉన్న ఆభరణాలు, డ్యూటీ పుస్తకాలను దోచుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధుల్లో ఉన్న టీటీఈలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని సీనియర్ డీసీఎంను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంగ్ కార్యదర్శి బాలాజీ, యూనియన్ చైర్మన్ డి.వి. వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక మహోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

నందిగామ: పట్టణంలోని చెరువుబజార్ షిరిడి సాయిమందిరం 23వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల తువ్వ కాలువ పక్కనున్న ముత్యాలమ్మవారి ఆలయ 15వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు వేగినేటి వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ట్రక్కర్స్ ప్రాజెక్టుకు రక్తదాన అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు):అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు గాను బెస్ట్ రక్తదాన అవార్డును అందచేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జూపూడి ఉషారాణి చేతుల మీదగా ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ వివి సాంబశివరావు అవార్డును అందుకున్నారు. ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. అలా అత్యధిక రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించింది. అంతేకాక గతంలో రెండు సార్లు ఏపీశాక్స్ నుంచి ట్రక్కర్స్ ప్రాజెక్టుకు జిల్లా కలెక్టర్ అవార్డులు అందచేసినట్లు సాంబశివరావు తెలిపారు.



డాక్టర్ ఉషారాణి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న సాంబశివరావు

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగిసిప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో కెఎస్.రామరావు ఘాట్‌రోడ్డులోని దేవస్థాన బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఈవో భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మరో వైపున మహా నివేదన నిమిత్తం మధ్యాహ్నం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్జిత సేవలకు రద్దీ

అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు ఇతర ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అమ్మవారిని శుక్రవారం పలువురు రాష్ట్ర మంత్రులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

బస్సుల్లో ఈవో తనిఖీలు...

దేవస్థానం నడిపే బస్సుల్లో ఆలయ ఈవో కెఎస్. రామరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత ఓం టర్నింగ్‌లోని దేవస్థానం బస్సులు నిలిపే పాయింట్‌కు చేరుకున్న ఈవో బస్సులు ఏయే సమయాలకు వస్తున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్సులో ప్రయాణించి దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. బస్సులో ప్రయాణించే సమయంలో ఆలయంలో అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయంలోని ఇంజినీరింగ్, ఇతర విభాగాలలో అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు ఈవో రామరావు పేర్కొన్నారు.

ఆదర్శ కార్మికోద్యమనేత ‘పర్స’

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, రాష్ట్ర కార్మికోద్యమ నేత, సీఐటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పర్స సత్యనారాయణ ఆదర్శ నేత అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌పేట ఎంబీ జ్ఞాన కేంద్రంలో శుక్రవారం పర్స సత్యనారాయణ శతజయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవులు.... పర్స చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ చావు తప్పి కన్ను లొట్ట బోయినట్లు కేంద్రంలోని బీజేపీకి ఎన్నికల్లో ఫలితాలు వచ్చాయని చెప్పారు. దీనికి కారణం మోదీ ప్రజా వ్యతిరేక విధానాలేనన్నారు. గత విధానాలు బీజేపీ కొనసాగిస్తే పోరాటాలతో ప్రతిఘటిస్తామని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం ఆ సంస్థను నేటికీ ప్రభుత్వ రంగంలో ఉంచిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పర్స విశాఖ ఉక్కు కోసం శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రజల పక్షాన నిలబడిన ప్రజా ప్రతినిధి అని, అటువంటి ఆదర్శ పాలన కావాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, మంతెన సీతారాం, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఉన్నదాంట్లోనే తోటి వారికి సహాయం చేయాలని వైఎస్సార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక 8వ డివిజన్ సున్నపుబట్టీల సెంటర్ దగ్గర ఉన్న అశోక్‌నగర్‌లోని పార్టీ డివిజన్ కార్యాలయంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సయ్యద్ ఇమ్రాన్‌కు రూ.15 వేల నగదును ఆర్థిక సహాయంగా జయప్రకాష్ శుక్రవారం అందచేశారు. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలమని, అందువల్ల ఆర్థికంగా వెనుకబడిన పిల్లల చదువునకు తమ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నానని చెప్పారు. గోగం బాలకోటయ్య, కనగాల రాజశేఖర్, తుమ్మల శివరామకృష్ణ, పిన్నమనేని సాయి తదితరులు పాల్గొన్నారు.



స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ బ్లాక్ చేస్తే జరిమానా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీని బ్లాక్ చేసేవారికి అధికారులు వెంటనే జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద రోడ్డుపై డ్రైనేజీ నీళ్లు నిలవటంపై అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైన్‌లలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ (ఇంటర్నెట్ కేబుల్స్), ప్లాస్టిక్ బాటిల్స్, బస్తాలు, పెట్ బాటిల్స్, వస్త్రాలు, చెప్పులు, ఇతర వ్యర్థాలను ఉండటం గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డ్రెయిన్లలో వర్షం నీరు పారకుండా నీటికి అడ్డుపడుతున్న కేబుళ్లను వెంటనే తొలగించాలని, ఫైబర్ కేబుల్స్ వల్ల జరుగుతున్న నష్టాన్ని భర్తీచేసేలా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్న సంస్థలకు భారీ జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.